స్కెచ్

# దీక్షాఫలితం

"అంపేరాయని"

దేవుడు లేడని వాదించే అన్నయ్యకి, ఇంటర్మీడియేట్ రెండుసార్లు ఫెయిల్ అవడంతో దేవుడున్నాడని దృఢనమ్మకం ఏర్పడింది. తన గదిలో గోడలకున్న సినిమా తారల ఫొటోలన్నీ లాగి పారేసి వాటిస్థానే 'దశావతారాల' పటాలు రీప్లేస్ చేశాడు. అన్నయ్యకు బాల్య స్నేహితుడూ, సహపాఠీ అన్నయ్యలాగే రెండుసార్లు ఇంటరు తప్పినటువంటి వాడూ...అయిన మా పక్కింటి మూర్తికూడా ఇదే పద్ధతిలోకి దిగేడు.

అప్పుడెప్పుడో తాము ఎస్. ఎస్. ఎల్. సి. పాసవుతే కనకదుర్గమ్మకి కొడతామని మొక్కుకుని మానుకున్న (దైవంమీద విశ్వాసం నశించిన కారణంగా) చెరి డజను కొబ్బరికాయలూ ఈ సి[illegible] కుదరగానే వెంటనే దుర్గగుడికి వెళ్ళి టపాటపా మోగించి వచ్చేశారు. ఏమ్మట మేమున్న ఇంట్లోనే ఒక గదిలో కంబైండ్ స్టడీస్ మొదలెట్టారు. సినిమాలూ షికార్లూ మానుకున్నారు.

వీళ్ళతోపాటు ఇంటరు చదివి పాసై ఇప్పుడు బి. కామ్. జూనియర్ చదువుతూన్న సూర్యం ఒక రోజున స్నేహితులిద్దరినీ పరామర్శించటానికి వచ్చి, వీళ్ళిద్దరి వ్యవహారం అంతా చూసి, ఇహనుంచీ...విజయవాడ వీధులన్నీ కళావిహీనంగా ఉంటాయనీ, 'లీలా మహల్' ఇర్వురు 'రెగ్యులర్ కస్టమర్స్'ని పోగొట్టుకుందనీ వాపోయాడు.

"మీరిద్దరూ ఇలా భీష్మించుకూర్చుంటే కుదరదు. మీ ప్రతిజ్ఞలను కాస్త సడలించండి." అని కోరాడు. కాని ఈ అపర భీష్ములిద్దరూ అతని అభ్యర్థనను వినిపించుకోలేదు.

"అదేం వీలుపడదు" అన్నారు చిక్కచ్చిగా.

తను ఏది చెప్పినా వీళ్ళు వినిపించుకునే స్థితిలో లేరని గ్రహించినట్టుంది సూర్యం ఆపైన ఏమీ మాట్లాడ్లేదు. కాసేపు కారమ్సు ఆడుకుని వెళ్ళిపోయాడు.

మరునటి రోజునుంచీ అన్నయ్యా మూర్తీ మరీ పట్టుబట్టి రాత్రింబవళ్లు ఏకబిగిని చదువు మొదలెట్టారు. కాలకృత్యాలకూ, భోజనానికి తప్పించి ఎప్పుడూ ఆ గదిలోంచి బైటికి వచ్చేవాళ్ళు కారు. రాత్రిపూట ఇంట్లోనే అమ్మచేత 'టీ' పెట్టించుకుని, అది ఒక ఫ్లాస్కులో పోసి ఉంచుకుని నిద్ర వచ్చినప్పుడల్లా అది సేవిస్తూ చదువు సాగించేవారు. ఇదివరకు అన్నయ్య తరచు నాతో కేరమ్సు ఆడేవాడు. అప్పుడప్పుడూ ఏవైనా తెలీని పాఠాలుంటే చెప్పేవాడు. ఇప్పుడదేమీ లేదు. నాతో ఎక్కువగా మాట్లాడటంకూడా మానివేశాడు. ఎప్పుడైనా అవసరముంటే మాటాడతాడు.

"చెల్లాయ్! అమ్మ 'టీ' పెట్టటం ఐందేమో చూసి, ఐతే ఈ ఫ్లాస్కులో పోసి పట్రామ్మా!" అని నాతో ఎప్పుడో ఒకసారి చెప్తూంటాడు.

రోజులు గడిచేకొద్దీ అన్నయ్యలోనూ మూర్తిలోనూ ఏదో మార్పు కనిపించసాగింది. ఇద్దరూ గడ్డాలూ మీసాలూ పెంచేసి క్రమంగా ఋషిపుంగవుల్లా తయారయ్యారు.

"ఇదేమిట్రా నీబొంద బెట్టా. నీ అవతారం నువ్వూ ఇలా తయారవుతున్నావేమిట్రా." అంది అమ్మ అన్నయ్యతో ఒకనాడు వాడు భోంచేస్తున్నపుడు. నేనుకూడా పక్కనే ఉన్నాను. నాకు నవ్వాగిందికాదు. పగలబడి నవ్వేశాను.

"ఎందుకంత నవ్వు!" అంటూ నా నెత్తిన మొట్టి అన్నయ్య గబగబా భోజనం ముగించి లేచి పోయాడు.

• • •

ఒక రోజున సూర్యంవచ్చి వీళ్ళనిచూసి మూర్ఛపోయినంతపని చేశాడు.

"ఈ ఆకారాలేమిటి? సన్యాసుల్లా తయారయ్యారేమిట్రా" అన్నాడు.

"దీక్షరా బ్రదర్ దీక్ష!" అన్నాడు అన్నయ్య.

"కాదురా వెంకటేశ్వర స్వామికి మొక్కుకున్నాం" అన్నాడు మూర్తి.

"ఏం ఆయన మీద పడ్డారు! ఇంకే దేవుడూ మిమ్మల్నిద్దర్నీ గట్టెక్కించేదుకు సమర్థుడుగా కనపడలేనా ఏమిటి?" అని వాచీ చూసుకుని— "అర్జెంటు పనుంది మళ్ళీ కలుస్తాను. హుషారుగా చదవండి" అంటూ అన్నయ్య బుజం చరిచి వెళ్ళిపోయాడు.

రోజులు దొర్లిపోయాయి. పరీక్షలు దగ్గర పడ్డాయి. పరీక్షలిక నాలుగైదు రోజులున్నాయనగా అన్నయ్యా మూర్తీ హాల్ టికెట్స్ తెచ్చుకోటానికి ఐడెంటిఫికేషన్ సర్టిఫికేట్స్ కోసం వెడితే, ఇదివరకు వీళ్ళని బాగా ఎరిగున్న లెక్చరర్లుకూడా ఇప్పటి వీళ్ళ స్వరూపాలు చూసి, మీరెవరో మాకు తెలియదు పొమ్మన్నారుట. అక్కణ్ణుంచి వీళ్ళిద్దరూ మాడుముఖాలు వేసుకుని వచ్చి యిళ్ళదగ్గిర ఆ సంగతి చెపితే నాన్నా వాళ్ళూ వీళ్ళని వెంటేసుకు కాలేజీకి వెళ్ళి... "వీడు మా అబ్బాయేనండీ" అని వాళ్ళకు నచ్చజెప్పి వీళ్ళకి...హాల్ టికెట్స్ వచ్చేటట్లు చేసేటప్పటికి తలప్రాణం తోకకు వచ్చినంత పనయింది. నాన్నగారు ఈ సంగతంతా అమ్మతో చెప్పి పొట్ట చెక్కలయ్యేలా నవ్వేశారు.

పరీక్షలై పోయాయి.

"పరీక్షలై పోయాయిగా తిరుపతి వెళ్ళి రారాదూ" అన్నారు నాన్న ఒకరోజున ఇద్దరితో.

"పరీక్షా ఫలితాలు వస్తేగాని వెళ్ళం" అన్నారు వాళ్లు నాన్నతో.

పరీక్షా ఫలితాలుకూడా వచ్చాయి. అన్నయ్య నంబరూ, మూర్తి నంబరూ సెకండ్ క్లాసులో ఉన్నాయి. ఈ పరీక్ష ఇన్నేళ్లు చదివి పాసయినందుకే తాము ఏదో పెద్ద 'ఘనవిజయం' సాధించినట్టుగా ముఖాలు పెట్టారు అన్నయ్యా మూర్తీనూ.

"మీ ముఖం ఫస్టుక్లాసులో పాసవ్వాల్సింది" అన్నారు నాన్న. సూర్యం వచ్చి మిత్రులిద్దరికీ కంగ్రాట్స్ చెప్పి వెళ్ళాడు.

మరునటి రోజునే అన్నయ్యా మూర్తీ తిరుపతికి ప్రయాణమై వెళ్ళి మొక్కుబడి కాస్తా చెల్లించి వెంటనే తిరిగి వచ్చేశారు. ఆ రాత్రి చీకట్లో బాగాకనిపించలేదు కాని తలలకు మఫ్లర్‌లు చుట్టుకుని వచ్చినట్లుగా ఉంది.

"అమ్మయ్య! ఇప్పుడు మిమ్మల్ని చూడ బుద్ధవుతోందిరా" అంది అమ్మ నిట్టూర్పు విడుస్తూ.

ఆ రాత్రి సుష్టుగా భోంచేసి సెకండ్ షో సినిమాగ్గూడ వెళ్ళి వచ్చారు మిత్రులిద్దరూ.

పొద్దున్నే లేచి మిత్రులిద్దరూ ముఖాలు కడుగుతూంటే అనుకోనట్టుగా పేపరొకటి చేతులో పుచ్చుకుని సూర్యం మా ఇంటికొచ్చాడు. ముఖం విచారంగా ఉంది.

"అదేవిట్రా అలా ఉన్నావ్?" అన్నాడన్నయ్య.

"బ్రదర్స్ మీకో విషాదవార్త చెప్పాల్సి వచ్చినందుకు నాకు చాలావిచారంగా ఉంది."అనా న్నెమ్మదిగా సూర్యం.

"ఏం నీ పరీక్ష పోయిందేవిటి?" అన్నాడు మూర్తి వ్యంగ్యంగా.

"కాదు బ్రదర్స్. మీ పరీక్షే పోయింది. మొన్నటి పేపర్లో మీ నంబర్లూ ఇంకా కొందరివీ పాసైన వాళ్ళ లిస్టులో పొరపాటుగా ప్రకటింపబడ్డట్టుగా ఈ రోజు పత్రికలో ఒక సవరణపడింది, చదవండి." అంటూ చేతులో పట్టుకున్న పేపరు తీసుకొచ్చి ఇద్దరికీ చూపించాడు.

అన్నయ్యా, మూర్తీ ఇద్దరూ పేపరు చూసి ఖిన్నులై నిలబడ్డారు. పాపం! ఆ సమయంలో వాళ్ళని చూసి నవ్వాలో ఏడవాలో కూడా అర్థంకాలేదు.

